الَّذِیْ خَلَقَکُمْ مِّنْ نَّفْسٍ وَّاحِدَۃٍ وَّخَلَقَ مِنْهَا
زَوْجَهَا وَبَثَّ مِنْهُمَا رِجَالًا کَثِیْرًا وَّنِسَآءً

# قرآن

## کا نظامِ خاندان

# దివ్యఖుర్‌ఆన్ కుటుంబ వ్యవస్థ

298


రచన :
మౌలానా సయ్యద్ జలాలుద్దీన్ ఉమరీ

# దివ్యఖుర్ఆన్

# కుటుంబ వ్యవస్థ


రచన :

మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమరీ

**తెలుగు అనువాదం**

అబ్దుల్ వాహెద్



**Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.

**Divya Quran Kutumba Vyavastha**
**Quran ka Nizam-e-Khandan (Telugu)**

**TIP Series No.** : **298**

Written by : Moulana Syed Jalaluddin Umari

Translated by : Abdul Wahed

*All Rights Reserved with Publishers*

First Edition : April 2017

Copies : 2000

**Price** : **Rs.30**

ISBN : 978-93-81111-48-2

Published by : **Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 040 – 24564583, 24576237
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-500 002.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-500 002.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో...

## ముందుమాట

2009 నవంబర్ 20, 21 తేదీలలో అలీగఢ్‌లోని ఉలూముల్ ఖుర్ఆన్ సంస్థ ఆధ్వర్యంలో "కుటుంబ వ్యవస్థ: దివ్యఖుర్ఆన్ బోధనలు" అనే అంశంపై ఒక సెమినార్ జరిగింది. ఈ సెమినార్ ప్రారంభ కార్యక్రమంలో నన్ను ప్రసంగించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవసరమైన నోట్సుతో నేను చేసిన ప్రసంగాన్ని న్యూఢిల్లీ లోని తస్నీఫీ అకాడమీ కార్యదర్శి, సోదరుడు డాక్టర్ ముహమ్మద్ రజీఉల్ ఇస్లామ్ నద్వీ అక్షరబద్ధం చేశారు. మొత్తం ప్రసంగానికి సబ్ హెడ్డింగులతో వ్యాస రూపం ఇచ్చారు. ఆయనకు చాలా ధన్యవాదాలు. ఆ పుస్తకాన్ని నేను మరోసారి చదివి, కొన్ని మార్పులు చేర్పులు చేశాను. తర్వాత ఇది తహ్కీకాతె ఇస్లామీ (మార్చి 2010) త్రైమాసిక పత్రికలో ప్రచురించబడింది.

ఈ వ్యాసం మరికొన్ని చేర్పులతో మరికొన్ని సంస్కరణలతో పుస్తకరూపంలో మీ ముందుకు వచ్చింది. ఇందులో కుటుంబానికి సంబంధించి దివ్యఖుర్ఆన్ బోధనలు ఒకే చోట వివరంగా వచ్చాయి. ఇస్లామీయ కుటుంబం గురించి తెలుసుకోడానికి ఇది ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను. ఈ పుస్తకం ఇంగ్లీషు, హిందీ భాషల్లో అనువాదమైంది. "కుటుంబ పరిచయ ఉద్యమం" సందర్భంగా జమాఅత్ శాఖ ఒకటి ఈ పుస్తకాన్ని పెద్ద ఎత్తున ప్రచురించింది.

కుటుంబానికి సంబంధించిన ఇస్లామీయ ప్రబోధనలపై నేను రాసిన అనేక పుస్తకాలు ప్రచురించబడ్డాయి. లోతయిన అవగాహన కోసం వాటిని అధ్యయనం చేయవచ్చు. అల్లాహ్ ఈ ప్రయత్నాలు స్వీకరించాలని ప్రార్థిస్తున్నాను.

– జలాలుద్దీన్ ఉమరీ

**అక్టోబర్ 9, 2014.**

# దివ్యఖుర్‌ఆన్‌లో కుటుంబ వ్యవస్థ

## కుటుంబం : సాముదాయిక జీవితంలో ప్రాధమిక సంస్థ

మనిషి సాముదాయికంగా జీవిస్తాడన్నది మనందరికీ తెలిసిన విషయం. మనిషి నైజం లోనే ఈ వైఖరి ఉంది. సమాజంతో కలిసి ఉండాలని అనుకుంటాడు. మరో విషయ మేమంటే, మనిషి అవసరాలు కూడా సమాజంతో కలిసిమెలిసి ఉన్నప్పుడే తీరుతాయి. మనిషిని దేవుడు ఇలాగే సృష్టించాడు. ఒంటరిగా తన అవసరాలు తీర్చుకోలేడు. అనేక మంది కలిస్తేనే అవసరాలు తీరుతాయి. ఈ సామాజిక నిర్మాణంలో ప్రాథమికమైనది, అత్యంత ముఖ్యమైనది కుటుంబం. దీనితోనే సామాజిక నిర్మాణం ప్రారంభమవుతుంది. అనేక కుటుంబాలు కలిసి సమాజాన్ని ఏర్పరుస్తాయి.

కుటుంబాలు అనేకవిధాలుగా ఉండేవని సామాజిక నిపుణులు చెబుతారు. ఇప్పుడు కూడా వివిధ రకాల కుటుంబాలు ఉన్నాయి. చిన్న కుటుంబాలు. మధ్య రకం కుటుం బాలు కూడా ప్రతి కాలంలోను ఉండేవి. పెద్ద పెద్ద కుటుంబాలు కూడా ఉండేవి. చిన్న కుటుంబం అంటే భార్యాభర్త పిల్లలు ఉన్న కుటుంబం. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు కూడా కుటుంబంలో కలిసి జీవిస్తారు. కొన్ని కుటుంబాలు ఉమ్మడి కుటుంబాలుగా ఉంటాయి. అనేక కుటుంబాలు వేర్వేరుగా ఒకే చోట ఉండడం లేదా ఉమ్మడిగా ఉండడం కూడా జరగవచ్చు.

### కుటుంబవ్యవస్థను ఇస్లామ్ పటిష్టం చేసింది

ఇస్లామ్ మౌలికమైన కుటుంబ వ్యవస్థను పటిష్టం చేసింది. దైవికమైన హితబోధలు లోపించడం వల్ల, మనోవాంఛల వల్ల, దౌర్జన్యాలు అన్యాయాల వల్ల కుటుంబవ్యవస్థలో చోటు చేసుకున్న అనేక చెడుగులను తొలగించింది. దివ్యఖుర్‌ఆన్‌లో ఈ చెడుల గురించి వివరంగా ఉంది. ఈ చెడులను ఎలా దూరం చేసుకోవాలో కూడా చెప్పింది. కుటుంబ వ్యవస్థలో చోటు చేసుకున్న రుగ్మతలను దూరం చేయడమే కాదు, ఒక ఆదర్శ కుటుంబం గురించి తెలియజేస్తూ, కుటుంబం అంటే ఇలా ఉండాలని చెప్పింది. సమస్యలు తలెత్తితే ఎలా పరిష్కరించుకోవాలో చెప్పింది. ఈ విధంగా సహజంగా కుటుంబానికి కావలసిన అవసరాలు నెరవేరడమే కాదు, న్యాయానికి సంబంధించిన లోటుపాట్లు కూడా ఉండని వ్యవస్థను ఇచ్చింది. పవిత్రమైన, సంస్కారయుతమైన సమాజ నిర్మాణానికి ఆరోగ్య

వంతమైన కుటుంబం తప్పనిసరి అవసరంగా దివ్యఖుర్‌ఆన్ బోధిస్తుంది. ఏ కాలంలో అయినా, ఎలాంటి పరిస్థితులు ఉన్నా, కుటుంబం ఒక శాశ్వతమైన, పటిష్టమైన వ్యవస్థగా ఉండాలని ఖుర్‌ఆన్ కోరుతుంది. అందుగ్గాను నైతికత, చట్టం రెండింటిని ఖుర్‌ఆన్ ఉపయోగించుకుంది. వివిధ పద్ధతులతో కుటుంబవ్యవస్థను పటిష్టం చేసింది.

## సన్యాసత్వం, విశృంఖలత్వం- రెండింటికీ మధ్యేమార్గం

కుటుంబం అన్నది స్త్రీ పురుషుల లైంగిక సంబంధం వల్ల ఏర్పడుతుంది. లైంగిక సంబంధం విషయానికి వస్తే అన్నింటినీ పరిత్యజించి సన్యాసత్వం స్వీకరించే సిద్ధాంతం కూడా కనబడుతుంది. అంటే, మనిషి ఆధ్యాత్మిక వికాసంలో లైంగిక సంబంధాలు ప్రతిబంధకమని అది భావిస్తుంది. ఆధ్యాత్మికంగా ఎదగాలని కోరుకునే వ్యక్తి లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలని చెబుతుంది. మరోవైపు ఎలాంటి ఆంక్షలు, పరిమితులు లేకుండా స్వేచ్ఛగా మనిషి తన మనోవాంఛలు తీర్చుకోవాలని చెప్పే విశృంఖలత్వమూ ఉంది. సన్యాసత్వం నెమ్మది నెమ్మదిగా అంతరిస్తోంది కాని, లైంగిక విశృంఖలత్వానికి మాత్రం మార్గాలు తెరుచుకునే ఉన్నాయి. అది ఇప్పుడు ప్రపంచంలో మరింత ఎక్కువైంది. కాని ఇస్లామ్ మధ్యేమార్గాన్ని చూపించింది. లైంగిక వాంఛల పరిపూర్తి మనిషికి సహజమైన అవసరంగా ఇస్లామ్ గుర్తిస్తుంది. అయితే లైంగిక వాంఛల పరిపూర్తికి ఆంక్షలతో కూడిన అనుమతి మాత్రమే ఇవ్వాలని భావించింది. అందుకోసమే నికాహ్‌ను షరతుగా విధించింది. నికాహ్ ద్వారా మాత్రమే మనిషి తన లైంగిక కోరికలు తీర్చుకోవాలి. ఇది ధర్మసమ్మతం మాత్రమే కాదు, పుణ్యప్రదం అని కూడా చెప్పింది. ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (స) ప్రతి మంచిపనిలోను పుణ్యం లభిస్తుందని చెబుతూ, మీ లైంగిక కార్యాలలోను పుణ్యం ఉందని అన్నారు. అప్పుడు అనుచరులు ఆయనతో, దైవప్రవక్తా! మనిషి తన కోరిక తీర్చుకుంటే దానికి కూడా పుణ్యం లభిస్తుందా' అని ప్రశ్నించారు. అప్పుడు ప్రవక్త "మీ అభిప్రాయం ఏమిటి? మనిషి తన కోరికను తప్పుడు పద్ధతిలో తీర్చుకుంటే పాపం లభించదా? అదేవిధంగా అతను సరయిన పద్ధతిలో కోరిక తీర్చుకుంటే పుణ్యం కూడా లభిస్తుంది." (సహీహ్ ముస్లిమ్, కితాబుజ్జకాత్)

లైంగిక వాంఛలను అణచుకోవడం అన్నది మనిషి నైజానికి విరుద్ధం. ఈ ప్రయత్నం ఫలించేది కాదు. దీన్ని ఇస్లామ్ కఠినంగా వారించింది. ప్రవక్త సహచరులు కొందరు ఈ విధంగా అన్నీ పరిత్యజించి సన్యసించాలన్న వైఖరి ప్రదర్శించినప్పుడు ప్రవక్త వారిని

నివారిస్తూ అలా చేసే అనుమతి ఇస్లామ్ లో లేదని అన్నారు. ఒక హదీసులో ఇలా చెప్పారు:

**"ఇస్లామ్‌లో సన్యాసం లేదు."**

ఈ ఉల్లేఖనం ప్రామాణికత దృష్ట్యా కొంత బలహీనమైనది అయినప్పటికీ, ఈ హదీసులో ఉన్న మాటలను బలపరిచే ప్రామాణిక హదీసులు కూడా ఉన్నాయి. ప్రవక్త సహచరుల్లో కొందరు లైంగిక వాంఛలు లేకుండా చేసుకోడానికి నపుంసకులుగా మారాలని భావించినప్పుడు ఆ విషయం తెలిసి ప్రవక్త ఇలా అన్నారు:

> **" సన్యసించాలన్న ఆదేశం నాకు ఇవ్వలేదు" (సునన దారిమీ, కితాబున్నికాహ్, బాబున్నహీ అనిత్తబ్తీల్)**

## నికాహ్ లక్ష్యం

నికాహ్ ద్వారా మనిషి పవిత్రమైన, గౌరవప్రదమైన జీవితం గడపగలడు. చెడు పనులకు దూరంగా ఉండగలడు. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు:

> **"యువకుల్లారా, మీలో వివాహం చేసుకునే స్థోమత ఉన్నవారు వివాహం చేసుకోవాలి." (సహీహ్ బుఖారి, కితాబున్నికాహ్)**

ఫిఖావేత్తలు ఈ విషయమై చాలా నొక్కి రాశారు. ఎవరైనా హజ్ చేసే అవకాశమున్నా కూడా, వివాహం చేసుకోకపోతే చెడుకు పాల్పడే అవకాశం ఉన్నట్లయితే హజ్ వాయిదా వేసి ముందు వివాహం చేసుకోవాలి. ఎందుకంటే హజ్ తర్వాత కూడా చేయవచ్చు. కాని వివాహాన్ని వాయిదా వేస్తే చెడుకు పాల్పడే ప్రమాదం ఉంది.

పైన చెప్పిన హదీసులోనే ఇంకా ఇలా కూడా ఉంది :

"వివాహం చేసుకునే స్థోమత లేని వ్యక్తి ఉపవాసాలు పాటించాలి. ఉపవాసం అతన్ని చెడునుంచి కాపాడుతుంది."

భావమేమిటంటే ఉపవాసాలు పాటించడం వల్ల లైంగిక వాంఛలు అదుపులో ఉంటాయి. మనిషి హాయిగా తింటూ సుఖవంతమైన జీవితం గడుపుతున్నప్పుడే అతని వాంఛలు ఆ స్థాయిలో పెరుగుతాయి. వాటిని అదుపు చేసుకునే పద్ధతి ఉపవాసాలు పాటించడంగా చెప్పడం జరిగింది. తినడం తాగడంపై పరిమితులు ఉన్నప్పుడు లైంగిక వాంఛలు కూడా

అదుపులో ఉంటాయి. చెడు నుంచి దూరంగా ఉండడానికి మనిషి సుఖవిలాసాల జీవితానికి దూరంగా ఉండడం కూడా ఒక పద్ధతి.

దివ్యఖుర్ఆన్‌లో ముహ్రమాత్ (వివాహం చేసుకోవడం నిషిద్ధమైన స్త్రీలు) గురించి చెప్పిన తర్వాత ఇలా చెప్పడం జరిగింది:

> **"వీరు (ముహ్రమాత్) తప్ప మిగతా స్త్రీలందరినీ మీరు మీ ధనం ద్వారా పొందటం మీకు హలాల్ (ధర్మసమ్మతం) చెయ్యబడిరది. అయితే వారికి వివాహబంధంతో రక్షణ కల్పించాలి. అంతేకాని విశృంఖలమైన కామక్రీడలకు ఒడిగట్టరాదు." (అన్నిసా 24)**

భావమేమిటంటే, ముహ్రమాత్ లను వివాహం చేసుకోవడం నిషిద్ధం. వారు తప్ప ఇతర స్త్రీలకు మెహర్ చెల్లించి వివాహం చేసుకోవచ్చు. కాని దాని లక్ష్యం ఏమిటంటే సౌశీల్యంతో కూడిన జీవితం గడపడం. అక్రమ సంబంధాలకు దూరంగా ఉండడం.

దివ్యఖుర్ఆన్‌లోని ఈ అరబీ వాక్యంలో 'ముహ్సినీన్' అన్న పదం ఉపయోగించబడింది. హిస్న్ అన్న పదానికి అరబీలో కోట అనే అర్థం ఉంది. ముహ్సినీన్ అనడంలో భావమే మిటంటే, చెడులు దాడి చేయలేని సురక్షితమైన కోట వంటి వివాహబంధంలోకి ప్రవేశిం చాలని. అంటే ఈ కోటలోకి వచ్చిన వ్యక్తి చెడుల నుంచి సురక్షితంగా ఉంటాడు. ఇదే వాక్యంలో "ముసాఫిహీన్" అనే పదం వాడబడింది. సఫహ్ అనే పదానికి అరబీలో భావం విశృంఖల కామవాంఛల వెనుక పరుగెత్తడం. వివాహం చేసుకోవాలని ఆదేశించడంతో పాటు ఎందుకు చేసుకోవాలో చెప్పడానికి, దాని వల్ల మీ పవిత్రత సురక్షితంగా ఉంటుందనీ, చెడులకు దూరంగా ఉంటారని చెప్పబడింది.

## దంపతులు ఒకరికొకరు ప్రశాంతత

నికాహ్ సంబంధాన్ని ప్రేమానురాగాల సంబంధంగా దివ్యఖుర్ఆన్ పేర్కొంటుంది. ప్రేమ సహజమైనది, ఇరువైపుల ఉండేది. ఈ ప్రేమాభిమానాల సంబంధం వల్ల జీవితంలోని చికాకులు, అస్థిమితం, మనోవైకల్యాలు దూరమవుతాయి. ప్రశాంతత లభిస్తుంది. మనిషి తనకు పరిచయంలేని అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. చాలా సందర్భాల్లో పెళ్ళాడిన అమ్మాయితో అంతకు ముందు పరిచయమే ఉండదు. కాని నికాహ్ తర్వాత వారి మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఇది కూడా దేవుని చిహ్నాల్లో ఒకటి:

> **"ఆయన సూచనలలో ఒకటి ఏమిటంటే; ఆయన మీ కొరకు భార్యలను మీ**

**జాతిలో నుండే సృష్టించాడు– మీరు వారివద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.“ (అర్రూమ్ 21)**

నికాహ్ లక్ష్యాలలో దంపతులు ఒకరి నుంచి మరొకరు ప్రశాంతత పొందడం కూడా ఒకటిగా ఈ వాక్యంలో చెప్పడం జరిగింది. ఈ వాక్యంలో ఉన్న మరో విషయం నికాహ్ ద్వారా అల్లాహ్ దంపతుల మధ్య ప్రేమ సృష్టిస్తాడు. ఇక్కడ ప్రేమ ఇద్దరి తరఫున ఉండాలన్న సూచన కూడా ఉంది. ఒక వైపున మాత్రమే ప్రేమ ఉంటే ఎక్కువ కాలం నిలబడదు. ప్రశాంతత విషయానికి వస్తే జీవితంలోని పరుగుల్లో, ఆందోళనల్లో భర్తకు ఇంట భార్య వద్ద మాత్రమే ప్రశాంతత లభిస్తుంది. అదేవిధంగా భార్యకు కూడా భర్త వద్దనే ప్రశాంతత, సాంత్వన లభిస్తాయి. నేడు మనిషి ప్రశాంతత కోసం పరితపిస్తున్నాడు. ప్రాపంచికంగా ఎంత ప్రగతి సాధించినా ప్రశాంతత కరువయ్యింది. ప్రశాంతత కావాలనుకుంటే దాంపత్య జీవితం గడపాలని దివ్యఖుర్‌ఆన్ బోధించింది. ఆలోచించే వారికి, పరిశీలించేవారికి ఇందులో అనేక సూచనలున్నాయి. ఇద్దరు అపరిచితులు నికాహ్ తర్వాత ఒకరికి ఒకరు ప్రశాంతతగా మారిపోతారు.

దంపతుల మధ్య సంబంధం ఏవిధంగా ఉండాలో దివ్యఖుర్‌ఆన్ ఈ విధంగా తెలిపింది:

**“వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు” (అల్ బఖర 187)**

దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యాన్ని తరచి చూసిన కొద్దీ కొత్త కొత్త కోణాలు మన ముందుకు వస్తాయి. దివ్యఖుర్‌ఆన్ ఎంత గొప్పగా, ఎంత అర్థవంతంగా పోలిక చెప్పిందో అని ఆశ్చర్యపోతాం. మనిషి దుస్తులు మనిషికి అతి సమీపంగా ఉంటాయి. అంతకన్నా దగ్గరగా మరేదీ ఉండదు. మీరు స్త్రీలకు దుస్తుల వంటివారు, స్త్రీలు మీకు దుస్తుల వంటి వారని దివ్యఖుర్‌ఆన్ చెప్పింది. భార్యాభర్తల మధ్య సాన్నిహిత్యాన్ని సూచించడానికి ఇంతకన్నా గొప్ప పోలిక మరొకటి ఉండదు. దుస్తులు మన శరీరంలో లోపాలను కప్పి పుచ్చుతాయి. శరీరంలో ఏ భాగాన దుస్తులు ఉంటాయో అక్కడ ఎలాంటి పుండ్లు, గాయాలు, మచ్చలు లేదా మరో లోపం ఏది ఉన్నా దుస్తులు దాన్ని కప్పేస్తాయి. దివ్యఖుర్‌ఆన్ ఇదే చెబుతోంది. నీవు భార్యకు దుస్తుల వంటి వాడివి. భార్య నీకు దుస్తుల వంటిది. ఒకరు మరొకరికి ఆచ్ఛాదన వంటి వారు.

## పురుషుడు కుటుంబానికి పెద్ద

కుటుంబ నిర్మాణంలో స్త్రీపురుషులు ఇద్దరి పాత్రను ఇస్లామ్ గుర్తిస్తుంది. పురుషుడిని కుటుంబానికి పెద్దగా గుర్తిస్తుంది. ఏ చిన్న సంస్థ అయినా ఎవరో ఒకరు బాధ్యులు ఉండాలి. లేకపోతే నడవదు. సంస్థలోని ప్రతి ఒక్కరు తమ మాటే చెల్లాలని పట్టుపడితే అది సాధ్యం కాదు. అందుకే దివ్యఖుర్‌ఆన్ స్త్రీపురుషులు ఇద్దరు కలిసి కుటుంబాన్ని నిర్మిస్తారు. కుటుంబపెద్దగా పురుషుడు ఉంటాడని పేర్కొంది.

> **" పురుషులు స్త్రీలకు అధికారులు (ఖవ్వామ్), ఎందుకంటే అల్లాహ్ వారిలో ఒకరికి మరొకరిపై ఆధిక్యతను ప్రసాదించటంవల్ల, ఇంకా పురుషులు తమ సంపదను వారికొరకు ఖర్చు చేస్తున్నందువల్ల."** (అన్‌నిసా 34)

కుటుంబ వ్యవస్థలో పురుషుడిని కుటుంబపెద్దగా నిర్ణయించిన ఈ ఖుర్‌ఆన్ వాక్యంలో రెండు కారణాలు చెప్పడం జరిగింది. ఒక కారణం అల్లాహ్ పురుషుడికి శారీరకంగాను, మేధోపరంగాను తదితర విషయాల్లోను అధిక సామర్థ్యం ప్రసాదించాడు. రెండవ కారణం స్త్రీ ఆర్థిక బాధ్యతలు పురుషుడిపై ఉన్నాయి. ఆర్థికబాధ్యతలు పురుషుడిపై పెట్టడానికి కారణం కూడా పురుషుడికి లభించిన శక్తిసామర్థ్యాల వల్లనే. ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు బలవంతుడు అయినప్పుడు మరొకరు బలహీనుడు అయినప్పుడు బలవంతుడు బలహీనుడి బాధ్యతను స్వీకరించవలసి ఉంటుంది. దివ్యఖుర్‌ఆన్ ప్రకారం స్త్రీ కన్నా పురుషుడు బలవంతుడు, స్త్రీ బలహీనురాలు, అందువల్ల పురుషుడు ఆమె కోసం తన సంపద ఖర్చు పెట్టాలి. ఆమె అవసరాల పట్ల శ్రద్ధ వహించాలి. ఇది సాధారణ నియమం. దీనికి భిన్నమైన పరిస్థితులు కూడా ఉండవచ్చు. స్త్రీ తన భర్త కన్న బలమైనదిగా ఉండవచ్చు. శక్తిసామర్థ్యాలు కలిగి ఉండవచ్చు. సంపద అధికారాలు కలిగి ఉండవచ్చు. ఇవన్నీ సాధ్యమే. కాని ఇవన్నీ ప్రత్యేక పరిస్థితులు. కాని సర్వసాధారణంగా మగవాడిని కుటుంబపెద్దగా చెప్పడం జరిగింది. ఇక్కడ కేవలం శక్తిసామర్థ్యాలు, బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని మగవాడిని కుటుంబపెద్దగా చెప్పడం జరిగింది.

కుటుంబ వ్యవస్థ సక్రమంగా నడవాలంటే పురుషుడిని కుటుంబ పెద్దగా స్త్రీ స్వీకరించినప్పుడే సాధ్యం. సంతోషపూర్వకంగా భర్త మాట వినడానికి సిద్ధంగా ఉన్నప్పుడే సాధ్యం. అందుకే దివ్యఖుర్‌ఆన్ ఇలా తెలిపింది:

> **" కనుక సుగుణవతులైన స్త్రీలు విధేయత కలిగివుంటారు. పురుషులు లేనప్పుడు అల్లాహ్ రక్షణలో ఉంటూ వారి హక్కులను కాపాడుతారు."** (అన్‌నిసా: 34)

ఈ వాక్యంలో 'ఖానితాత్' అన్న పదం వాడబడింది. ఖునూత్ అన్న పదానికి అర్థం విధేయత. ఖానితాత్ అంటే విధేయత కలిగిన పుణ్యస్త్రీలు అని భావం. అల్లాహ్ ఆదేశాలు, భర్త మాట పట్ల విధేయత చూపేవారని అర్థం. ఈ ఖుర్‌ఆన్ వాక్యంలో "బిమా హాఫిజల్లాహు" అన్న పదాలకు భావం ఏమిటంటే, అల్లాహ్ స్త్రీల హక్కులను పరిరక్షించాడు, పురుషులకు నిరంకుశాధికారం ఇవ్వలేదు అందువల్ల వారికి విధేయత చూపాలి. భర్తకు విధేయత చూపడం వల్ల తమ హక్కులు కోల్పోతామన్న అనుమానంలో ఉండరాదు.

## దౌర్జన్యం, అన్యాయాల నుంచి స్త్రీలకు రక్షణ

అధికారంతో పాటు దౌర్జన్యం, అన్యాయాలు జరిగే అవకాశాలు కూడా ఉంటాయి. పురుషులకు అధికారమిస్తే వారి తరపున దౌర్జన్యం, అన్యాయాలు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. వాటిని నివారించడానికి రెండు ముఖ్యమైన చర్యలు తీసుకోవడం జరిగింది. మొదటిది స్త్రీల పట్ల ఉత్తమంగా వ్యవహరించాలని తాకీదు చేయడం. ఈ విషయమై దివ్యఖుర్‌ఆన్ ఇలా బోధించింది:

> **"వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టివుండవచ్చు." (అన్‌నిసా: 19)**

సద్భావంతో అంటే సమాజంలో మేలైన వ్యవహారశైలికి సంబంధించి ఎలాంటి ప్రమాణాలు ఉన్నాయో వాటికి అనుగుణంగా స్త్రీలతో వ్యవహరించాలి. కాలం, పరిస్థితులు, స్వయంగా భార్యాభర్తల జీవన ప్రమాణాలు వగైరాలపై కూడా ఇది ఆధారపడి ఉంటుంది. సామాజిక వాతావరణం, నివసించే దేశం వగైరాలపై కూడా ఆధారపడి ఉంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే సాధారణంగా అందరు ఉత్తమవ్యవహారశైలి అని భావించే విధంగా స్త్రీల పట్ల వ్యవహరించాలి. దీనితో పాటు మరో ముఖ్యమైన విషయం కూడా చెప్పబడింది. ఆమెలో కొన్ని విషయాలు మీకు నచ్చకపోవచ్చు. అయినప్పటికీ ఆమె పట్ల ఉత్తమవ్యవహారశైలి కొనసాగించాలి. భార్యలోని కొన్ని అలవాట్లు లేదా కొన్ని విషయాలు భర్తకు అయిష్టంగా ఉండవచ్చు. ఆమె వ్యవహారశైలి నచ్చకపోవచ్చు. ఆమె చిరచిరలాడుతూ ఉండవచ్చు. కోపంతో మండిపడడం జరగవచ్చు, అప్పడప్పుడు పరుషంగా ఆమె మాట్లాడవచ్చు, భర్త చెప్పిన మాట ఒక్కోసారి వినకపోవచ్చు. ఇలాంటి పరిస్థితిలోనూ భార్య పట్ల భర్త వ్యవహారశైలి ఉత్తమంగా ఉండాలని దివ్యఖుర్‌ఆన్ బోధించింది. ఇలాంటి పరిస్థితిలో ఇంత కన్నా ఉత్తమమైన బోధన ఉంటుందా? ధర్మవేత్తల

ప్రకారం ఖుర్ఆన్‌లోని ఈ వాక్యంలో (అల్లాహ్ ఇందులో ఎన్నో మేళ్ళు పొందుపరిచాడు) మీకు ఉత్తమమైన, మీ హృదయాన్ని ఆనందంతో నింపే, దైవభక్తి, దైవభీతి కలిగిన ఉత్తమ సంతానం అల్లాహ్ మీకు ఆమె వల్ల ప్రసాదించవచ్చని, ఆ సంతానాన్ని చూసి మీరు వారి తల్లి మీ పట్ల ప్రదర్శించిన వ్యవహారశైలిని మరిచిపోతారని వివరణ ఇచ్చారు.

స్త్రీల పట్ల కేవలం ఉత్తమ వ్యవహారశైలికి సంబంధించిన బోధన మాత్రమే లేదు. వారికి లభించిన చట్టబద్ధమైన హక్కులను కూడా స్పష్టంగా నిర్దేశించడం జరిగింది. ఈ విషయమై దివ్యఖుర్ఆన్ ఇలా బోధించింది:

> **"మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి." (అల్ బఖర 228)**

స్త్రీలకు బాధ్యతలు ఉన్నాయి. వారికి హక్కులూ ఉన్నాయి. భార్య తన బాధ్యతలను నిర్వర్తిస్తుందా లేదా అన్నది చూసే హక్కు భర్తకు ఉంది. అలాగే భార్య హక్కులు ఆమెకు లభిస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించుకోవాలి. దివ్యఖుర్ఆన్ స్త్రీ హక్కులు, బాధ్యతలు రెండింటిని ప్రస్తావించింది. దాంపత్య జీవితంలో స్త్రీ తన బాధ్యతలు నిర్వర్తిస్తుందో లేదో చూడ్డంతో పాటు ఆమెకు లభించవలసిన హక్కులు లభిస్తున్నది లేనిది చూసే ఏర్పాటు కూడా ఉంది.

## బహుభార్యత్వానికి అనుమతి

ఇస్లామ్ పురుషునికి ఒకరికన్నా ఎక్కువ భార్యలను పెళ్ళాడే అనుమతి ఇచ్చింది. అరబ్బుల్లో అంతకు ముందు నుంచి బహుభార్వత్వం ఉంది. వారు అనేకమంది భార్యలను పెళ్ళాడేవారు. ఇతర మతాల్లోనూ బహుభార్వత్వంపై నిషేధమేమీ లేదు. అరబ్బులే కాదు, అరబ్బు ప్రాంతాలకు వెలుపల కూడా స్తోమత కలిగిన పురుషులు అనేకమంది భార్యలను కలిగి ఉండేవారు. ఎంతమంది భార్యలయినా ఉండవచ్చు. ఎలాంటి పరిమితి ఉండేది కాదు. కాని ఇస్లామ్ దానికి పరిమితి విధించింది. పురుషుడు అత్యధికంగా నలుగురు భార్యలను కలిగి ఉండవచ్చని భార్యల సంఖ్యపై ఆంక్ష పెట్టింది. పైగా ఈ అనుమతి యుద్ధ నేపథ్యంలో ఇచ్చిన అనుమతి. ఆ కాలంలో జరిగిన యుద్ధాల్లో నవయువకులే ఎక్కువగా ఉపయోగపడేవారు. అందువల్ల ఒకే భార్య ఉండాలన్న ఆంక్ష విధిస్తే యుద్ధంలో మరణించిన వారి వితంతువులు భర్తలు లేకుండా ఒంటరివారై పోతారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఇస్లామ్ పురుషుడు ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలను వివాహం చేసుకునే అనుమతి ఇచ్చింది. అయితే ఈ అనుమతిని కేవలం యుద్ధ పరిస్థితులకు మాత్రమే పరిమితం చేయలేదు. ఇది సాధారణ అనుమతిగా ఇవ్వడం

జరిగింది. ఎందుకంటే, అనేక కారణాల వల్ల పురుషుడు భార్య ఉండగానే మరో వివాహం చేసుకోవలసిన అవసరం రావచ్చు. అందువల్ల ఈ అనుమతి కేవలం యుద్ధపరిస్థితుల కారణంగా ఇచ్చిన అనుమతి మాత్రమే కాదు, ఇది అన్ని కాలాలకు వర్తించే సాధారణ అనుమతి. అయితే దివ్యఖుర్‌ఆన్ ఈ విషయంలో రెండు షరతులను కూడా విధించింది. మొదటి షరతు– పురుషుడు ఒకే కాలంలో నలుగురి కన్నా ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండడానికి వీలు లేదు. రెండవ షరతు, ఒకరి కన్నా ఎక్కువ మంది భార్యలుంటే వారి మధ్య న్యాయం చేయడం తప్పనిసరి. దివ్యఖుర్‌ఆన్ ఇలా తెలియజేసింది:

> **“ అనాథులకు న్యాయం చెయ్యలేమనే భయం మీకు కలిగితే, మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరేసిగాని, ముగ్గురేసిగాని, నలుగురేసిగాని వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే భయం మీకుంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి లేదా మీ స్వాధీనంలోకి వచ్చిన స్త్రీలను దాంపత్యంలోకి తీసుకోండి. అన్యాయానికి దూరంగా ఉండేందుకు ఇది ఉత్తమ మార్గం” (అన్‌నిసా : 3)**

దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ మాటలు చాలా ముఖ్యమైనవి. భార్యల మధ్య న్యాయం చేయలేమన్న అనుమానం ఉంటే ఒకే భార్యను కలిగి ఉండాలి. అంటే పెళ్ళికి ముందు మనిషి తన పరిస్థితులను, తన వనరులను, స్తోమతను చూసుకోవాలి. ఇందులో శారీరక సామర్థ్యం, ఆర్థిక స్తోమత రెండూ ఉన్నాయి. తన వయసు, తన శక్తి, కలిగే సంతానం, వారి పోషణ, వారి విద్యాశిక్షణల గురించి ఆలోచించాలి. న్యాయం చేయలేనని అనుకుంటే, ఒకటి కన్నా ఎక్కువ పెళ్ళిళ్ళు చేసుకోరాదు. ఈ షరతుల వల్ల అన్యాయం, దౌర్జన్యం జరగకుండా ఉంటాయి. ఒకరి కన్నా ఎక్కువ మందిని వివాహం చేసుకుని, వారి మధ్య న్యాయం చేయలేకపోతే, వారిలో ఎవరి హక్కులైనా నిర్వర్తించలేకపోతే, ఆమె చట్టబద్ధంగా చర్యలు తీసుకునే అవకాశం ఇస్లామీయ షరీఅత్‌లో ఉంది.

## దాంపత్య సంబంధాలు దెబ్బతింటే

దాంపత్యసంబంధం ఎల్లప్పుడూ సంతోషంగా కొనసాగకపోవచ్చు. ఒక్కోసారి మనస్పర్థలు, పొరపొచ్చాలు రావచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మనిషి సహనంతోను, ఓర్పుతోను వ్యవహరించాలని ఇస్లామ్ బోధిస్తుంది. వివేకంతో, వివేచనతో, అవగాహనతో సమస్యలు పరిష్కరించుకోడానికి ప్రయత్నించాలి. ఈ సందర్భంలో కొంతమేరకు భార్యపట్ల కఠినంగా కూడా వ్యవహరించవచ్చు. కాని అలా అని ఈ అధికారాన్ని దుర్వినియోగపరచడానికి, హద్దులు మీరడానికి అవకాశం లేదు. అదేవిధంగా భర్తలో ఏదన్నా తప్పు

ఉంటే భార్య కూడా దాన్ని పరిష్కరించడానికి తగిన ప్రయత్నాలు చేయాలి. ఈ ప్రయత్నాలు చేసినప్పటికీ భార్యాభర్తల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిని వారు తమ మధ్య మనస్పర్థలను దూరం చేసుకోలేని పరిస్థితి తలెత్తవచ్చు. అలాంటి పరిస్థితిలో దివ్యఖుర్‌ఆన్ బోధనలేమంటే ఇరువురి తరఫునుంచి ఒక్కో వ్యక్తిని మధ్యవర్తిగా నియమించుకోవాలి. వారిద్దరు అవగాహనతో, చర్చల ద్వారా సమస్య పరిష్కరించే ప్రయత్నం చేయాలి. సాధారణంగా ఉడుకురక్తం కలిగిన యువతీ యువకులైతే ఆవేశం ఉంటుంది. ఆవేశంలో మాటతూలడం జరగవచ్చు. కొన్ని సందర్భాల్లో ఇరువురి కుటుంబాల సభ్యులు కూడా అవగాహన లేకుండా మాట్లాడి సమస్యను మరింత జటిలం చేయవచ్చు. అయితే నిజాయితిగా ఇరువురి తరఫున పెద్దమనుషులు సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తే పరిష్కారం సాధ్యమే: దివ్యఖుర్‌ఆన్ ఇలా ప్రకటించింది.

> **"భార్యభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయనే భయం మీకు కలిగితే, భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని నియమించండి. వారిద్దరు సంస్కరణను కోరితే అల్లాహ్ వారి మధ్య సమాధానం కుదరటానికి మార్గం చూపుతాడు. అల్లాహ్ సర్వజ్ఞాని, సకలమూ ఎరిగినవాడు." (అన్‌నిసా: 35)**

ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే దంపతులు సయోధ్య పట్ల మొగ్గు చూపితే, అల్లాహ్ కూడా వారి మధ్య సంబంధం మెరుగుపడేలా చేస్తాడు. అలాగే ఇరువురి తరఫునుంచి సయోధ్య కోసం ప్రయత్నించే పెద్దమనుషులు నిజాయితిగా సమస్య పరిష్కరించాలని ప్రయత్నిస్తే అల్లాహ్ తప్పక ఆ ప్రయత్నం ఫలించేలా చేస్తాడు.

పైన పేర్కొన్న దివ్యఖుర్‌ఆన్ వాక్యం రెండు కుటుంబాలకు సంబంధించినది. రెండు కుటుంబాలకు చెందిన పెద్దమనుషులు సయోధ్యకు ప్రయత్నించాలని ప్రబోధిస్తుంది. ఈ ఖుర్‌ఆన్ వాక్యం పూర్తి ముస్లిమ్ సమాజాన్ని ఉద్దేశించి చేసిన ప్రబోధం కూడాను. ఒకవేళ వ్యవహారం న్యాయస్థానం వరకు వెళ్ళితే అప్పుడు న్యాయస్థానం కూడా మధ్యవర్తులను నియమించవచ్చు. వాళ్ళూ సయోధ్య కోసమే ప్రయత్నించాలి. వాళ్ళు దంపతులకు సలహాలు, సూచనలు, మంచిమాటలు చెప్పగలరే తప్ప తీర్పు చెప్పలేరు. తుది నిర్ణయం తీసుకునే హక్కు కేవలం దంపతులకు మాత్రమే ఉంది. ఏది ఏమైనా ఇది ఆచరించవలసిన, అభిలషణీయమైన పని.

## తలాక్ పరిస్థితి

పరిస్థితిని చక్కదిద్దడానికి చేసే ప్రయత్నాల తర్వాత కూడా, సయోధ్య ప్రయత్నాల తర్వాత

కూడా దంపతులు కలిసి ఉండలేకపోతే, సంబంధం నిలబడే పరిస్థితి లేకపోతే, అప్పుడు ఇస్లామ్ పురుషుడికి తలాక్ అవకాశాన్ని, స్త్రీకి ఖులా అవకాశాన్ని ఇస్తుంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు తీవ్రమై, సంబంధం పూర్తిగా దిగజారిన తర్వాత కూడా, వారిద్దరూ కలిసి బతకడం దుర్భరమైపోయిన తర్వాత కూడా విడాకులకు అవకాశం లేదని ఇస్లామ్ చెప్పలేదు. పురుషుడికి తలాక్, స్త్రీకి ఖులా అవకాశాన్ని వాడకూడదని ఎక్కడా చెప్పలేదు.

ఆ కాలంలో, అరబ్బు సమాజంలో విడాకులకు హద్దుపద్దు ఉండేది కాదు. పురుషుడు తన భార్యను ఎప్పుడు పడితే అప్పుడు తలాక్ ఇచ్చేవాడు, మరలా అదే భార్యను స్వీకరించే వాడు. ఆ విధంగా భార్యను జీవితాంతం వేధించడం కొనసాగేది. కాని దివ్యఖుర్‌ఆన్ ఈ పరిస్థితిని మార్చింది. తలాక్ పురుషుడి హక్కు అయినప్పటికీ, ఇద్దత్ కాలంలో తలాక్‌ను ఉపసంహరించుకుని తిరిగి కలిసిపోయే అవకాశం ఉంది. కాని తలాక్ జరిగిపోయిన తర్వాత రెండు సార్లు మాత్రమే ఆ భార్యను మళ్ళీ వివాహమాడే అవకాశం ఉంది. అంటే రెండు సార్లకు మించి అదే భార్యకు తలాక్ ఇచ్చే అవకాశం లేదు.

> **“విడాకులు రెండుసార్లు ఇవ్వాలి. తరువాత భార్యను సక్రమంగా తమ వద్ద ఉండనివ్వాలి లేదా ఆమెను సహృదయంతో సాగనంపాలి.” (అల్ బఖర : 229)**

పైన పేర్కొన్న ఆయతులో తలాక్ తర్వాత తిరిగి సయోధ్య గురించి ప్రస్తావించడం జరిగింది. పురుషుడు కేవలం రెండు సార్లు మాత్రమే తలాక్, ఒక దాని తర్వాత మరొకటి ఇవ్వగలడు. భార్యతో (ఇద్దత్ కాలం మూడు నెలలు లేదా మూడు బహిష్టు కాలాలు) తలాక్ ఉపసంహరించుకుని కలవగలడు. ఒకవేళ తలాక్ వద్దనుకుని భార్యతో కలిసి జీవించే ఉద్దేశ్యం ఉంటే ఆమె పట్ల సముచితంగా, మంచిగా వ్యవహరించాలి. విడిపోవాలనుకుంటే ఉత్తమమైన పద్ధతిలో విడిపోవాలి. ఇద్దత్ కాలం గడిచిపోతే, ఈ లోపు తలాక్ వద్దనుకుంటే, అప్పుడు తలాక్ అమలైపోతుంది కాబట్టి మళ్ళీ ఆమెతో కలిసి ఉండాలనుకుంటే మళ్ళీ నికాహ్ చేసుకోవాలి. అయితే మూడోసారి తలాక్ ఇస్తే మళ్ళీ ఆ భార్యను వివాహమాడే హక్కు పురుషుడికి ఉండదు. మళ్ళీ అదే భార్య కావాలనుకుంటే చాలా కఠినమైన ఆంక్షలున్నాయి.

> **“ ఆ తరువాత (రెండుసార్లు విడాకులిచ్చిన పిదప భర్త భార్యకు మూడవసారి) విడాకులిస్తే, ఇక ఆ స్త్రీ అతనికి హలాల్ (ధర్మసమ్మతం) కాదు. ఆమె వివాహం వేరే పురుషునితో జరిగి, అతడు ఆమెకు విడాకులిస్తే తప్ప.” (అల్ బఖర 230)**

విడాకులివ్వబడిన మహిళ పునర్వివాహానికి ఎలాంటి అడ్డంకులు లేవు. మూడు తలాకులు అయిపోయిన తర్వాత ఆమె జీవితాంతం ఒంటరిగా ఇంట కూర్చోవలసిన అవసరమూ లేదు. ఇద్దత్ గడిచిన తర్వాత పునర్వివాహం చేసుకోవచ్చని దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా చెప్పింది. ఆ తర్వాత భర్త మరణించడం లేదా విడాకులివ్వడం జరిగితే (అది వివాహం తర్వాత పది ఇరవై సంవత్సరాలకు జరగవచ్చు, లేదా రెండు మూడు నెలలకు లేదా రెండు మూడు రోజులకు కూడా జరగవచ్చు) అప్పుడు ఆమె తన గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తాను అనుభవించిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఆమె మొదటి భర్త ఒకవేళ ఆమెను మరలా వివాహం చేసుకోవాలనుకుంటే, ఆమెకు కూడా ఇష్టమైతే, వారిద్దరి మధ్య మరలా నికాహ్ జరగవచ్చు. ఇది చాలా కఠినమైన పద్ధతి. అందువల్లనే తలాక్ ఇవ్వడం, మళ్ళీ అదే భార్య కావాలనుకుని నికాహ్ చేసుకోవడం ఒక ప్రహసనంగా మార్చుకోవద్దని హెచ్చరించడం జరిగింది. మూడవ తలాక్ ఇస్తే మరలా అదే భార్యను పొందడం చాలా కష్టం కాబట్టి వెయ్యి సార్లు ఆలోచించుకోవాలి.

## మూడు తలాకుల సమస్య

హదీసుల ప్రకారం తలాక్ అనేది నిర్ణీత కాలవ్యవధుల్లో స్త్రీ పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలున్నాయి. ప్రవక్త సంప్రదాయం ఏమంటే ఒకసారి తలాక్ ఇచ్చిన తర్వాత భర్త ఇద్దత్ కాలం వరకు వేచి ఉండాలి. ఆ తర్వాత తలాక్ అమలులోకి వస్తుంది. ఒక తలాక్ తర్వాత భర్త మళ్ళీ ఆమెతోనే జీవితం గడపాలనుకుంటే మళ్ళీ వివాహం చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రవక్త సహచరులు ఈ పద్ధతినే పాటించారు. భర్త ఒక తలాక్ ఇచ్చి విడాకులు పూర్తి చేసేవాడు. ఆ విధంగా దంపతులు విడిపోయే వారు. అలా ఇద్దత్ కాలం పూర్తయిన తర్వాత తలాక్ అమలులోకి వచ్చినా, భర్త మళ్ళీ ఆమె కావాలనుకుంటే వివాహమాడే అవకాశం ఉండేది. ధర్మవేత్తలందరూ ఈ విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారు. ఇక్కడ ఒక సమస్య చర్చల్లో ఉంది. అదేమంటే, పురుషుడు ఒకవేళ మూడు తలాకులు ఒకేసారి ఇచ్చేస్తే అప్పుడు పరిస్థితి ఏమిటి? అప్పుడు పురుషుడికి ఆ తర్వాత తలాక్ ఇచ్చే హక్కు ఉండదా? అతను మళ్ళీ ఆమెనే కోరుకుంటే వారిద్దరు కలిసే అవకాశం లేదా? ముస్లిమ్ సమాజంలో అధికశాతం ప్రజలే కాదు, ధర్మవేత్తలు చాలా మంది అభిప్రాయం ప్రకారం భర్తకు మూడు తలాకులు ఇచ్చే హక్కు ఉంది. భర్త మూడు తలాకులను ఒకేసారి వాడుకుంటే అవి మూడు తలాకులుగానే భావించబడతాయి. ఇక ఆ భర్తకు తలాక్ హక్కు మిగలదు. కాని అహ్లె హదీస్ పంథాకు

చెందిన వారు మాత్రం విభేదిస్తున్నారు. మూడు తలాకులు మూడు పరిశుద్ధావస్థల్లో – వేర్వేరుగా– ఇవ్వవలసినవి. ఒక పరిశుద్ధావస్థలో (భార్య బహిష్టు కాలంలో లేనప్పుడు) మూడు సార్లు కాదు వంద సార్లు తలాకు చెప్పినా అది ఒకే తలాక్‌గా పరిగణించ బడుతుంది. అందువల్ల భర్త మళ్ళీ ఆమెను స్వీకరించే హక్కు ఉంటుంది. గమనించ వలసిన విషయమేమంటే, మూడు తలాకులు ఇచ్చినప్పుడు అది ఒక తలాక్ అవుతుందా లేక మూడు తలాకులు అవుతాయా అన్నదే చర్చ కాని అస్సలు తలాక్ జరగలేదని మాత్రం ఎవరూ అనరు. తలాక్ అయిపోయినట్లే అందరూ భావిస్తారు. విభేదం ఏమంటే ఒకేసారి మూడు తలాక్‌లు ఇస్తే అవి మూడు తలాకులుగా పరిగణించబడతాయా లేక ఒకే తలాక్ గా పరిగణించాలా అన్నదే. సాధారణంగా ముస్లిమ్ సమాజంలో అత్యధికుల అభిప్రాయాన్నే సరయినదిగా భావించి దాన్నే ఆచరించడం జరుగుతుంది. అహ్లె హదీస్ పంథా అనుసరించేవారు తమ పంథాను అనుసరిస్తారు. ఆ ప్రకారమే తమ నిర్ణయాలు (ఫత్వా) చెబుతారు. ఈ సందర్భంగా గమనించవలసిన మరో అభిప్రాయమేమంటే, ఒకవేళ ఎవరయినా ఒక వ్యక్తి ఒకే సిట్టింగులో నొక్కి చెప్పడానికి తలాక్, తలాక్, తలాక్ అని మూడు సార్లు చెప్పినా ఒకే తలాక్ ఇవ్వాలన్నది భర్త సంకల్పమై ఉంటే అది ఒక్క తలాక్ గానే పరిగణించవలసి ఉంటుంది.

## సంతానం పోషణ, విద్యాశిక్షణలు

ఇస్లామీయ చట్టం ప్రకారం సంతానం తండ్రి బాధ్యత. సంతానం పోషణ, ఆర్థికబాధ్యతలు, విద్యాశిక్షణలు అన్నీ తండ్రిపైనే ఉంటాయి. అయితే సంతానంతో తల్లికి ఎలాంటి సంబంధమూ ఉండదని దీనికి అర్థం కాదు. ఫలానా మహిళ సంతానంగా చెప్పడంలో ఎలాంటి తప్పు లేదు. సంతానం తల్లిదండ్రులిద్దరికి చెందినదిగా దివ్యఖుర్‌ఆన్ పేర్కొంది.

> **"తమ సంతానం యొక్క పాలుపట్టే గడువు పూర్తికావాలని తండ్రులు కోరినపక్షంలో తల్లులు తమ బిడ్డలకు పూర్తిగా రెండు సంవత్సరాలు పాలుపట్టాలి. అప్పుడు ఆమెకు పిల్లల తండ్రి తగురీతిగా భోజన వస్త్రాలను ఇచ్చి పోషించవలసి ఉంటుంది. కాని శక్తికి మించిన భారం ఎవరిమీదా మోపకూడదు. (అంటే) బిడ్డను కన్న కారణంగా తల్లిమీద ఎక్కువ భారం మోపటం భావ్యం కాదు. బిడ్డకు తండ్రి కనుక తండ్రిని ఇరకాటంలో పెట్టటం కూడ సమంజసం కాదు"**

**(అల్ బఖర 233)**

దివ్యఖుర్ఆన్ చెప్పిన మాటలు గమనిస్తే సంతానం తల్లికి సంబంధించినదిగాను, తండ్రికి సంబంధించినది గాను చెప్పడం జరిగిందని తెలుస్తుంది. చట్టప్రకారం పోషణ బాధ్యత తండ్రిదే అయినా సంతానం తల్లికి సంబంధించినది కూడా.

ఇమ్రాన్ భార్య, హజ్రత్ మర్యమ్ తల్లి చేసుకున్న మొక్కు గురించి దివ్యఖుర్ఆన్ ప్రస్తావించింది:

> **"ఇమ్రాను స్త్రీ అల్లాహ్‌ను ఇలా ప్రార్థించినపుడు (అల్లాహ్ విన్నాడు). "ప్రభూ! నా గర్భంలో ఉన్న శిశువును నేను నీకు సమర్పించుకుంటున్నాను. అది నీ సేవకు అంకితం. నా ఈ కానుకను స్వీకరించు. నీవు అన్నీ వినేవాడవు, అన్నీ తెలిసిన వాడవు."(ఆలి ఇమ్రాన్ 35)**

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యాన్ని వివరిస్తూ ప్రముఖ హనఫీ ధర్మవేత్త అల్లామా అబూబక్ర్ జసాస్ రాజీ (రహ్మా) ఇలా అన్నారు:

> **"పిల్లల విద్యాశిక్షణ, ధార్మిక మార్గాన పిల్లలు నడిచేలా చేయడం, వారికి విద్యాబుద్ధులు గరపడంలో తల్లికి ప్రాముఖ్యం ఉందని ఈ వాక్యం వల్ల తెలుస్తోంది. ఆమె సంరక్షకురాలు కాగలదు. లేకపోతే ఆమె (ఇమ్రాన్ భార్య) ఇలా వేడుకునేది కాదు. అలాగే తండ్రి సంతానానికి పేరు పెట్టకపోతే తల్లికి పేరు పెట్టే హక్కు కూడా ఉంది. ఆ పేరు సక్రమమైనదే." (అబూబక్ర్ జసాస్, అహ్కాముల్ ఖుర్ఆన్ 14 / 2)**

## సంతానం పోషణ, అందుకోసం పరిశ్రమించడం తండ్రి బాధ్యత

> **" అప్పుడు ఆమెకు పిల్లల తండ్రి తగురీతిగా భోజన వస్త్రాలను ఇచ్చి పోషించ వలసి ఉంటుంది." (అల్ బఖర 233)**

అదేవిధంగా పిల్లలకు సరయిన విద్యాబుద్ధులు గరపడం కూడా తల్లిదండ్రుల బాధ్యతల్లోనిదే. తల్లిదండ్రులు ఈ విషయంలో ఆదర్శవంతంగా వ్యవహరించాలి. పిల్లలు సక్రమ మార్గంలో నడవాలని, నరకాగ్ని నుంచి రక్షించబడాలన్న చింత, తాము నరకాగ్ని పాలు కాకూడదన్న చింత తల్లిదండ్రుల్లో ఉండాలి.

> **"విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుంటుంబ సభ్యులనూ మానవులు, రాళ్లు ఇంధనం కాబోయే అగ్ని నుండి కాపాడుకోండి." (అత్ తహ్రీమ్ 6)**

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం ప్రకారం మనిషి తాను స్వయంగా నరకాగ్ని పాలు కాకుండా

వ్యవహరించాలి. తన భార్యాపిల్లలు కూడా నరకాగ్ని పాలు కాకుండా చూసుకోవాలి. మనిషి ఇతరులను సంస్కరించే ముందు తన్ను తాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవాలన్న సూచన కూడా ఈ వాక్యంలో ఉంది. ఇల్లు, ఇంటి వాతావరణం ఆదర్శవంతంగా లేకపోతే సంస్కరణ అనేది సాధ్యం కాదు. ఇదే విషయాన్ని దివ్యఖుర్ఆన్ ప్రవక్త ముహమ్మద్ (స) పవిత్ర భార్యలను ఉద్దేశించి ఇలా చెప్పింది:

**"మీ ఇళ్లల్లో వినిపించబడే అల్లాహ్ వాక్యాలనూ, వివేకంతో కూడుకున్న విషయాలనూ జ్ఞాపకముంచుకోండి." (అహ్జాబ్ : 34)**

మన ఇళ్ళు ధర్మసందేశ ప్రచార కేంద్రాలుగా మారాలని ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం ప్రబోధిస్తుంది.

## సంతానహత్యకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు

పుట్టిన ప్రతి మనిషి జీవించే హక్కుతో పుడతాడని దివ్యఖుర్ఆన్ స్పష్టం చేసింది. మనిషికి లభించిన ఈ హక్కును ఎవరూ లాక్కోలేరు. తల్లిదండ్రులైనా సరే తమ సంతానం జీవించే హక్కును కాదనడం కుదరదు. అది చట్టపరంగా నేరం. ఈ విషయాన్ని దివ్య ఖుర్ఆన్ చాలా వివరంగా తెలియజేసింది. పేదరికం, దారిద్ర్యం తదితర కారణాల వల్ల అరబ్బుల్లో సంతానహత్య జరిగేది. దివ్యఖుర్ఆన్ ఇలా చెప్పింది:

**"పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము మీకూ ఉపాధినిస్తున్నాము. వారికీ ఇస్తాము." (అల్ అన్ఆమ్ 151)**

కొన్ని సార్లు పేదరికం వల్ల కాదు, పేదరికం దాపురిస్తుందన్న భయం వల్ల కూడా సంతానహత్య జరుగుతుంది. దివ్య ఖుర్ఆన్ దీన్ని కూడా నివారించింది:

**"పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తాము, మీకూ ఇస్తాము. వాస్తవానికి వారిని హత్య చేయటం ఒక పెద్ద నేరం." (బనీ ఇస్రాయీల్ : 31)**

సంతానహత్యను ఏవిధంగాను సమర్థించడం సాధ్యంకాదు. అందుకే దివ్యఖుర్ఆన్ ఈ ఘాతుకాన్ని అజ్ఞానం గాను, వ్యక్తికి, జాతికి నష్టంగాను పేర్కొంది:

**"అజ్ఞానం వల్ల, మూర్ఖత్వం వల్ల తమ సంతానాన్ని హత్యచేసినవారూ, అల్లాహ్ ఇచ్చిన ఉపాధిని అల్లాహ్‌పై అబద్ధాలు మోపి నిషేధించుకున్నవారూ నిశ్చయంగా నష్టానికి గురిఅయ్యారు."(అల్ అన్ఆమ్ 140)**

మనిషి తన సంతానాన్ని హతమార్చడం అన్నది అత్యంత అనుచితమైన, కఠిన హృదయం కలిగిన దుశ్చేష్ట. అజ్ఞానం వల్ల ఇలాంటి దుర్మార్గానికి పాల్పడినవారు పెద్ద నష్టంలో ఉన్నారని దివ్యఖుర్‌ఆన్ పేర్కొన్నది. దీనివల్ల వంశం అంతరిస్తుంది. జాతి మానవ వనరులు నష్టపోతుంది. ఇది పూర్తిగా నష్టదాయకమైన పని. ఇలాంటి పనులకు పాల్పడే వారు ఈ విషయాలు ఆలోచించాలి.

## తల్లిదండ్రుల హక్కులు

దివ్యఖుర్‌ఆన్ లో సంతానానికి సంబంధించి తల్లిదండ్రుల బాధ్యతలు నొక్కి చెప్పడంతో పాటు, సంతానానికి కూడా తమ తల్లిదండ్రుల పట్ల మంచి వ్యవహారశైలి కలిగి ఉండాలని, వారి అవసరాలను పూర్తి చేయాలని హితబోధ చేయడం జరిగింది.

**"ప్రపంచంలో వారి పట్ల సద్భావంతో మెలగుతూ ఉండు" (లుక్మాన్ 15)**

తల్లిదండ్రుల పట్ల మంచి వ్యవహారశైలి అంటే ముసలితనంలో వారి పోషణ, వారి బాగోగులు చూడడం కూడా చేరి ఉంది. మరో చోట తల్లిదండ్రుల పట్ల మేలైన వైఖరి అవలంబించాలని ఉంది. ఇది కేవలం చట్టపరమైన బాధ్యతలు నిర్వర్తించడం మాత్రమే కాదు, వారి పట్ల గౌరవమర్యాదలు కూడా చేరి ఉన్నాయి. వారి కోసం ప్రార్థిస్తూ ఉండాలని కూడా చెప్పడం జరిగింది. అన్నివిధాల సాధ్యమైన సేవలన్నీ చేసినప్పటికీ ఏదో ఒక లోపం జరగవచ్చు, ముఖ్యంగా తల్లిదండ్రులు ముసలివారైనప్పుడు, వారు ఎక్కువగా పిల్లలపై ఆధారపడి ఉంటారు. వారిలో చికాకు, చిటపటలు ఎక్కువగా ఉండవచ్చు. అలాంటి పరిస్థితిలోవారి పట్ల మేలైన రీతిలో వ్యవహరించాలని నొక్కి చెప్పడం జరిగింది:

> **"నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు: మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించండి. ఒకవేళ మీవద్ద వారిలో ఒకరు గాని ఇద్దరు గాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా "ఛీ" అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి: 'ప్రభూ! వారిపై కరుణ జూపు, బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు.' (బనీ ఇస్రాయీల్: 23,24)**

తల్లిదండ్రుల పట్ల జీవితాంతం మేలైన వ్యవహారశైలి కలిగి ఉండాలని, ముఖ్యంగా ముసలితనంలో వారి మానసికస్థితిని గుర్తించి మెలగాలని హితవు గరపడం జరిగింది. తల్లిదండ్రుల విషయంలో సంతానానికి ఇంతకన్నా ఉత్తమమైన హితబోధ మరేదీ ఉండదు.

## వృద్ధాశ్రమాలు

ఇస్లామీయ బోధనల ప్రకారం వృద్ధాశ్రమాలకు అవకాశం ఉందా అన్న ప్రశ్న ప్రస్తుత కాలంలో వినిపిస్తోంది. నా అభిప్రాయం ప్రకారం వృద్ధాశ్రమాలన్న భావన దివ్య ఖుర్ఆన్‌లో లేదు. దివ్యఖుర్ఆన్‌లోని వాక్యం "వారు మీ వద్ద ఉంటూ, ముసలివయసుకు చేరుకుంటే" ప్రకారం తల్లిదండ్రులు సంతానంతో పాటు ఉండాలని తెలుస్తోంది. కాని నేటి పరిస్థితుల్లో కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులను తమతో పాటు ఉంచడం సాధ్యం కాని పరిస్థితి ఉంటుంది. భార్య కారణంగా కావచ్చు. ఆమెకు భర్త తల్లిదండ్రులు తమతో ఉండడం ఇష్టం లేకపోవచ్చు. ఆమెను అదుపు చేయలేని భర్త కావచ్చు. లేదా, తల్లిదండ్రులు భారతదేశంలోను, కొడుకు అమెరికా లేదా బ్రిటన్ వగైరా దేశాల్లో ఉండడం కావచ్చు. విదేశాల్లో ఉద్యోగం చేస్తూ ఉండవచ్చు. ఇలాంటి ఇతర పరిస్థితులు కూడా ఉండవచ్చు. దివ్యఖుర్ఆన్ వాక్యంలోని భావం కేవలం తల్లిదండ్రుల ఆర్థిక అవసరాలు తీర్చడం మాత్రమే కాదు, వారిని సంతోషంగా ఉంచాలని కూడా తెలుస్తోంది. దీనికి ఎలాంటి పద్ధతి పాటించాలన్నది నిర్ధారించడం కుదరదు. కాని ప్రతి మనిషి స్వయంగా ఆలోచించుకోవాలి, ఇలాంటి పరిస్థితిలో తల్లిదండ్రులను సంతోషంగా ఉంచడానికి ఏం చేయాలన్నది నిర్ణయించుకోవాలి.

## రక్తసంబంధాన్ని గౌరవించడం

తల్లిదండ్రులు, భార్యాపిల్లల హక్కులతో పాటు దివ్యఖుర్ఆన్ రక్తసంబంధాన్ని గౌరవించాలని, బంధువుల హక్కులు నిర్వర్తించాలని కూడా బోధించింది.

> **"ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి." (అన్‌నిసా : 1)**

విశ్వాసుల లక్షణాల్లో రక్తసంబంధాన్ని కాపాడ్డం కూడా ఒకటి:

**" స్థిరపరచండి అని అల్లాహ్ ఆదేశించిన సంబంధాలను స్థిరపరుస్తారు."**
**(అర్రాద్ 21)**

ఇది కేవలం హితబోధ ప్రవచనం మాత్రమే కాదు, ఇది గట్టిగా చెప్పిన ఆదేశం:

**"బంధువుల పట్ల మీ విధులను నిర్వహించండి. పేదవారిపట్ల, బాటసారులపట్ల, మీ విధులను నిర్వర్తించండి. వృధా ఖర్చు చెయ్యకండి. వృధా ఖర్చు చేసేవారు షైతాను సోదరులు". (బనీ ఇస్రాయీల్ 26)**

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యంలో చాలా ముఖ్యమైన విషయం చెప్పబడింది. వృధా ఖర్చులు చేయడం, సంపదను విచక్షణ లేకుండా ఖర్చు చేయడం, తప్పుడు మార్గాల్లో వ్యయ పరచడం వంటివి చేస్తే బంధువులు, హక్కు కలిగిన ఇతరుల హక్కులు నిర్వర్తించడం సాధ్యపడదు. సంపదను ఖర్చు చేయడంలో అదుపు ఉన్నప్పుడే వీళ్ళందరి హక్కులు నిర్వర్తించడం జరుగుతుంది.

## వారసత్వ చట్టం

బంధువులకు ఇతర హక్కులతో పాటు వారసత్వంలోను దివ్యఖుర్ఆన్ హక్కు ఇచ్చింది. ఎవరైనా చనిపోతే సాధారణంగా అతనికి జన్మించిన మగసంతానం వారసులవుతారని భావిస్తారు. అందులోను పెద్ద కొడుకుకు మాత్రమే వారసత్వం లభిస్తుందని కూడా కొందరు భావిస్తారు. స్త్రీలకు, యుక్తవయసుకు రాని పిల్లలకు వారసత్వం లేదన్న భావన కూడా ఉండేది. వారికి ఏమీ లభించేది కాదు. దివ్యఖుర్ఆన్ ఈ అన్యాయాన్ని, దోపిడిని అంతం చేసింది. దివ్యఖుర్ఆన్ ఇలా బోధించింది:

**"తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అదేవిధంగా తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది - అది తక్కువైనా సరే లేక ఎక్కువైనా సరే. ఈ భాగం (అల్లాహ్‌చే) నిర్ణయించబడింది." (అన్నిసా: 7)**

దీని భావమేమిటంటే, మనిషి మరణించినప్పుడు వదిలి వెళ్ళిన సంపద అది తక్కువైనా, ఎక్కువైనా దానిలో పురుషులతో పాటు స్త్రీలకు కూడా హక్కు ఉంది.

దివ్యఖుర్ఆన్‌లోని వారసత్వ చట్టానికి పునాది దాంపత్య సంబంధం, రక్తసంబంధాలు. కాబట్టి భార్యభర్తలు, తల్లిదండ్రులు, సంతానం (మగ, ఆడ సంతానం) అందరూ

హక్కుదారులు అవుతారు. ఈ సంబంధీకులంతా ఒకరికి ఒకరు వారసులే. వారిలో ఎవరి వారసత్వ హక్కునూ కాదనడం సాధ్యంకాదు. ఈ సంబంధీకులు లేకపోతే, లేదా వారికి రావలసిన వాటా ఇచ్చిన తర్వాత ఇతర వారసులకు హక్కు లభిస్తుంది.

మరణించిన వ్యక్తితో ప్రత్యక్ష సంబంధం ఉన్న వారికి, పరోక్ష సంబంధం ఉన్నవారికన్నా ఎక్కువ ప్రాధాన్యం దివ్యఖుర్‌ఆన్ ఇచ్చింది. ఈ సూత్రం ప్రకారం తండ్రి జీవించి ఉండగా తాత లేదా కొడుకులు బ్రతికి ఉండగా మనమడు వారసుడు కాలేడు. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు కూడా తండ్రి ద్వారా సంబంధం కలిగి ఉంటారు. అందువల్ల తండ్రి జీవించి ఉండగా వారికీ వారసత్వం ఉండదు.

## వీలునామా హక్కు

మనిషి తన సంపదకు వీలునామ రాయవచ్చు. వీలునామా ఏ విషయంలో అంటే, తన మరణానంతరం తన సంపద నుంచి కొంత భాగం ధర్మప్రచారానికి, ముస్లిముల శ్రేయోసంక్షేమ కార్యకలాపాలకు లేదా ఇలాంటి ఇతర పనులకు ఉపయోగించాలని రాయవచ్చు. దీనివల్ల వారసత్వ హక్కు లభించని తన బంధువుల ఆర్థిక అవసరాలు తీరుతాయి. వారి విద్యాశిక్షణలకు కూడా వీలునామా రాయవచ్చు. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ విషయంలో స్పష్టమైన నిర్దేశం ఇస్తూ వీలునామా అన్నది సంపదలో మూడో భాగానికి మాత్రమే గరిష్టంగా రాయగలడని చెప్పారు. అంతకన్నా ఎక్కువ వీలునామాలో రాస్తే అసలు హక్కుదారుల హక్కులు దెబ్బతింటాయి. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: “వారసత్వంలో హక్కు ఉన్నవారి కోసం ప్రత్యేకంగా వీలునామా రాయడం కుదరదు.”

మనిషి వీలునామా రాసే హక్కును దివ్యఖుర్‌ఆన్ గుర్తిస్తుంది. దానికి ప్రాముఖ్యం కూడా ఇస్తుంది. వారసత్వ ఆదేశాలకు సంబంధించి ఒక చోట దివ్యఖుర్‌ఆన్ ఇలా చెప్పింది:

> **“ మృతుడు వ్రాసిన వీలునామా అమలు జరిపిన తరువాత, అతడు చేసిన అప్పులు తీర్చిన తరువాత ఈ పంపిణీ జరగాలి. కాని ఇది (వారసులకు) నష్టం కలిగించేది కాకూడదు. ఇది అల్లాహ్ వైపు నుండి వచ్చిన ఆదేశం. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, అత్యంత మృదుస్వభావుడు.” (అన్‌నిసా: 12)**

ఇస్లామీయ ఆదేశాల ప్రకారం మరణించిన వ్యక్తి సంపద నుంచి మొదట అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేయాలి. అతను చేసిన అప్పులు ఉంటే వాటిని తీర్చాలి. అతను రాసిన వీలునామా అమలు చేయాలి. ఆ తర్వాత వారసులకు పంచాలి.

## ముగింపు

ఇస్లామ్ ప్రతిపాదించిన కుటుంబ వ్యవస్థ ఒక సమగ్రమైన వ్యవస్థ. ప్రేమ, నిజాయితీ, నైతికత, చట్టాల పునాదులపై ఈ వ్యవస్థను నిలబెట్టింది. అనేక కుటుంబాలు కలిస్తే సమాజం ఏర్పడుతుంది. కుటుంబ పరిధిలో ఇస్లామీయ ఆదేశాలు అమలైతే యావత్తు సమాజంపై దాని ప్రభావం పడుతుంది. సామాజిక వాతావరణంలో అలుముకున్న చెడుల వల్ల ముస్లిమ్ కుటుంబాలు కూడా ప్రభావితమవుతున్నాయి. ఇస్లామీయ బోధనల పట్ల నిర్లక్ష్యము పెరుగుతోంది. నేడు చెడులు అలుముకున్న వాతావరణం మన చేతుల్లో లేదు. కాని కుటుంబ పరిధిలో అల్లాహ్ మనకు ఇచ్చిన అవకాశాలు, అధికారాలను మనం సక్రమంగా వినియోగించుకుంటే, కుటుంబాన్ని ఇస్లామీయ బోధనల ప్రకారం నడిపితే పూర్తి సమాజం దానివల్ల ప్రభావితమవుతుంది. ఇస్లామీయ ప్రభావం అన్నింటా కనబడడం ప్రారంభమవుతుంది.

## ఇస్లామీయ సామాజిక వ్యవస్థపై మౌలానా జలాలుద్దీన్ ఉమరీ రాసిన పరిశోధనాత్మక, విద్యా విషయిక పుస్తకాలు

ఇస్లామీయ సూత్రాల ప్రకారం కుటుంబ నిర్మాణానికి ఈ పుస్తకాల నుంచి ప్రయోజనం పొందండి

### 1. ముస్లిమ్ మహిళల హక్కులు, వాటిపై అభ్యంతరాల విశ్లేషణ

ఇస్లామ్ మహిళలకు ప్రసాదించిన  హక్కులను సమగ్రంగా, పరిశోధనాత్మకంగా అర్థం చేసుకోడానికి, వాటిపై అభ్యంతరాలకు సమగ్రమైన జవాబులు తెలుసుకోడానికి ఈ పుస్తకం దోహదపడుతుంది.

ఆరవ ఎడిషన్, సమీక్ష, అదనపు చేర్పుల తర్వాత– పేజీలు : 240, ఇంగ్లీషు అనువాదం: Rights of Muslim Women A Critique of the Objections

### 2. ఔరత్ ఇస్లామీ మాషిరేమే

ప్రాచీన చరిత్రలో మహిళ, ఆధునిక సిద్ధాంతాలు. ఇస్లామీయ సమాజంలో భావనలు, సామాజిక పురోభివృద్ధిలో మహిళల పాత్ర, స్త్రీల విద్యాశిక్షణలు, స్త్రీల సామాజిక, రాజకీయ కార్యకలాపాలు, లైంగిక సంబంధాల గురించి ఇస్లామీయ దృక్కోణం వగైరా

ముఖ్యమైన విషయాలను చర్చించిన పుస్తకం. పేజీలు : 432 (నాల్గవ ఎడిషన్, కొత్తగా చేర్చిన వివరాలతో..)

## 3. ఔరత్ ఔర్ ఇస్లామ్

స్త్రీల నిజమైన కార్యపరిధి. ఇంటిలో ముస్లిమ్ మహిళ. తల్లి, భార్య, కూతురు, సోదరి హోదాలో స్త్రీ. విద్యా, కార్యాచరణ రంగాల్లో ముస్లిమ్ మహిళ వంటి ముఖ్యమైన అంశాలపై పరిశోధనాత్మక రచన. పేజీలు: 134 (పదవ ఎడిషన్. కొత్త సమాచారంతో...)

ఇంగ్లీషు అనువాదం: Woman in Islam. ఈ పుస్తకం హిందీ, మరాఠీ, గుజరాతీ, తమిళ భాషల్లో అనువాదమైంది.

## 4. ఇస్లామీయ కుటుంబ వ్యవస్థ

కుటుంబం ప్రాముఖ్యత, ఇస్లామీయ కుటుంబ నిర్మాణం వివరించిన పుస్తకం. మహిళలకు ఎదురయ్యే సమస్యలకు ఇస్లామీయ పరిష్కారాలు సూచించిన పుస్తకం. హిందీ అనువాదం పూర్తయ్యింది. పేజీలు: 200 (మూడవ ఎడిషన్)

## 5. ముస్లిమ్ మహిళల బాధ్యతలు

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎలా ఉండాలి? ముస్లిమ్ మహిళల సందేశ ప్రచార బాధ్యతలేమిటి? వాటిని నిర్వర్తించడంలో భార్యాభర్తల సహాయసహకారాల ప్రాముఖ్యత. సందేశప్రచారం చేస్తున్న మహిళల్లో ఉండవలసిన లక్షణాలు తదితర ముఖ్యమైన అంశాలను చర్చించిన పుస్తకం. పేజిలు: 56 (ఏడవ ఎడిషన్)

ఇంగ్లీషు అనువాదం : Muslim Women Role and Responsibilities. ఈ పుస్తకం తమిళంలో కూడా అనువాదమైంది.